సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



బంకుల్లో నాణ్యమైన సేవలు

ఐటీడీఏ పెట్రోల్ బంకుల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. 10లో



బాల్య వివాహాలతో అనర్థాలు

వెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 10లో



భూ రీ సర్వేతో మేలు

జగనన్న భూరక్ష, భూ రీసర్వేతో గిరిజన రైతులకు మేలు జరుగుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. 10లో

న్యూస్‌రీల్

సకాలంలో క్వార్టర్స్ నిర్మాణం పూర్తి



పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్: ఉద్యోగుల క్వార్టర్స్ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి అప్పగించాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయం సమీపంలో చేపట్టిన క్వార్టర్స్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. పూర్తి చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు నిధుల కొరత లేదని చెప్పారు. బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే చెల్లింపులు చేస్తామని తెలిపారు. పీవో వెంట గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం. రాజు తదితరులు ఉన్నారు.

గిరిజన ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. వంధన్ వికాస కేంద్రాలు, మహిళా సమాఖ్యల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను ట్రైఫెడ్ ఆధ్వర్యంలో స్థానిక వైటీసీలో ప్రదర్శించారు. వాటిని పీవో సూరజ్ గనోరే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మంచి గుర్తింపు ఉందన్నారు. అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌ను జీసీసీ, వెలుగు అధికారులు పర్యవేక్షించాలన్నారు. ట్రైఫెడ్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలోగల మహిళా సంఘాల సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను పరిశీలించి జాతీయ స్థాయిలో ట్రైఫెడ్ ద్వారా మార్కెటింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నవంబర్ 8న రైల్వేలో ప్రత్యేక అదాలత్

తాటిచెట్లపాలెం(విశాఖ): వాల్తేర్ డివిజన్ పరిధిలో పెండింగ్ కారుణ్య నియామక పెన్షన్ కేసులకు సంబంధించి నవంబర్ 8న ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలోని సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అదాలత్ ఉంటుందన్నారు. మరణించిన రైల్వే అధికారులు, పింఛన్‌దారుల వివరాలను ఎ–4 పేపర్‌పై తగిన ఫార్మాట్‌లో రాసి.. అక్టోబరు 31లోగా డివిజనల్ రైల్వే మేనేజర్(పి), మొదటి అంతస్తు, డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం కాంప్లెక్స్, దొండపర్తి చిరునామాకు పంపించాలన్నారు. కవరుపై కారుణ్యఅదాలత్–2023/ఈస్ట్‌కోస్ట్ రైల్వే/వాల్తేర్ అని కచ్చితంగా రాయాలని సూచించారు.

సింహగిరిపై రాత్రివేళ అన్న ప్రసాద వితరణ

సింహాచలం: సింహగిరిపై రాత్రి వేళ భక్తులకు అన్న ప్రసాద వితరణను సోమవారం రాత్రి నుంచి తిరిగి ప్రారంభించారు. కరోనాకు ముందు 2020 మార్చి వరకు పగలు, రాత్రి వేళల్లో భక్తులకు అన్నప్రసాదం అందించేవారు. కరోనా తర్వాత ఇప్పటి వరకు కేవలం మధ్యాహ్నం మాత్రమే అన్నప్రసాదం అందిస్తున్నారు. ఇటీవల దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసమూర్తి రాత్రి వేళల్లో అన్న ప్రసాద వితరణ పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం రాత్రి నుంచి ఈకార్యక్రమం ప్రారంభమైంది.

ఉజ్వల విశాఖి



ఇన్ఫోసిస్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

- ఐటీ, ఫార్మా కంపెనీలను ప్రారంభించిన సీఎం జగన్
- ఇన్ఫోసిస్ రాకతో బీచ్ ఐటీ కాన్సెప్ట్‌కు కొత్త ఉత్సాహం
- డేటా సెంటర్ డెస్టినేషన్‌గా విశాఖ అభివృద్ధి
- ఫార్మా సెజ్‌లో కంపెనీల విస్తరణతో భారీగా ఉపాధి అవకాశాలు
- విశాఖ నుంచి పరిపాలన సాగిస్తామన్న ముఖ్యమంత్రి
- ఉత్తరాంధ్రకు ఉత్సాహాన్నందించిన ముఖ్యమంత్రి పర్యటన

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్రతో పాటు సరిహద్దు జిల్లాల అభివృద్ధే లక్ష్యంగా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. పరిపాలనకు ప్రధాన కేంద్రంగా.. భవిష్యత్తులో ఉపాధికి కేంద్ర బిందువుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అడుగులు పడుతున్నాయన్న సీఎం మాటలు.. ఈ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా యువత ఆశలకు ఊపిరి పోశాయి. ఐటీ హబ్‌గా విశాఖను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్న విషయం ఇన్ఫోసిస్ ప్రారంభోత్సవంతో మరోసారి నిరూపితమైంది. తొలి విడతలో 1000 మంది ఉద్యోగుల సామర్థ్యంతో ఇన్ఫోసిస్ డేటా సెంటర్ కార్యకలాపాలను ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. ఇదే బాటలో మరికొన్ని సంస్థలు విశాఖ వైపు అడుగులు వేస్తున్నాయని సీఎం ప్రకటనతో విద్యార్థుల్లో నూతనోత్తేజం నెలకొంది. ఇప్పటికే విప్రో సంస్థ తమ సంస్థ కార్యకలాపాలను 1000 మంది వరకు విస్తరిస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మిగిలిన కంపెనీలు కూడా బీచ్ ఐటీ డెస్టినేషన్‌కు వస్తే.. ఉత్తరాంధ్ర యువతకు విశాఖ ఐటీ ఎంప్లాయిబిలిటీ డెస్టినేషన్‌గా మారనుంది.



ఇన్ఫోసిస్ కార్యాలయంలో సీఎం జగన్

- అలాగే సముద్రతీర ప్రాంత శుభ్రత కోసం జీవీఎంసీ రూ.15 కోట్లతో ఏర్పాటు చేసిన 6 బీచ్ క్లీనింగ్ యంత్రాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు.



బీచ్ క్లీనింగ్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

సీఎంవో ఇక్కడి నుంచే..

ఈ ఏడాది చివర్లో విశాఖ నుంచి పరిపాలన సాగిస్తానంటూ సీఎం జగన్ చేసిన ప్రకటనతో ఉత్తరాంధ్ర వాసుల్లో నూతన ఉత్సాహం పెల్లుబికింది. రెండేళ్లలో భోగాపురం అంతర్జాతీయ పౌర విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోందని సీఎం ప్రకటించడంతో.. ఉత్తరాంధ్రకు మంచిరోజులు వచ్చాయని ప్రజలంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. పేరుకే భోగాపురం విమానాశ్రయం అయినప్పటికీ.. వైజాగ్ ఎయిర్‌పోర్టుగానే వ్యవహరించనుంది. ఎందుకంటే విశాఖపట్నం నుంచే ఎక్కువగా రాకపోకలు సాగనున్నాయి. దీనికి అనుసంధానంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే కూడా రానుండటంతో బీచ్‌రోడ్డుతో పాటు భీమిలి నుంచి భోగాపురం వరకు ఆయా ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందనున్నాయి.





పరవాడ ఫార్మాసిటీలోని యుజియా స్టెర్లీ కంపెనీలో డబ్ల్యూఎఫ్‌ఐ జనరేషన్ సిస్టంను ప్రారంభిస్తున్న సీఎం జగన్, టెక్నీషియన్‌కు ఆత్మీయ పలకరింపు



ఇన్ఫోసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

డిజిటల్ విప్లవానికి నాంది..



ఇన్ఫోసిస్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

మధురవాడలోని హిల్ నం.4లో డిజిటల్ విప్లవం మొదలుకానుంది. ఇది కేవలం విశాఖకు.. రాష్ట్రానికి.. దేశానికి మాత్రమే కాదు.. యావత్ ఆసియా దేశాలకు పెద్దన్నగా మారనుంది. ప్రముఖ అదానీ సంస్థ ఏర్పాటు చేస్తున్న ఈ డేటా సెంటర్, టెక్నాలజీ బిజినెస్ సెంటర్.. 190 ఎకరాల్లో రూ.20 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో నిర్మితమవుతోంది. ఇది కూడా త్వరలోనే అందుబాటులోకి రానుందని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. దీంతో పాటు సింగపూర్ నుంచి ప్రత్యేక సబ్‌మెరైన్ కేబుల్ వేస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతికత రాజ్యమేలుతున్న నేపథ్యంలో.. డేటా స్టోరేజ్ పెంచడం, డిజిటలైజేషన్ విస్తరించడం, డేటా వేగం పెరగడం.. ఇలా విభిన్నమైన ప్రయోజనాలు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా ఐటీ పరిశ్రమలు విశాఖకు క్యూ కట్టనున్నాయి. ఫలితంగా మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉత్తరాంధ్ర యువతకు రానున్నాయి.



అచ్యుతాపురం ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్‌లో మందుల తయారీని పరిశీలిస్తున్న సీఎం జగన్

ఫార్మాలో కొలువుల జాతర

మరోవైపు ఫార్మా రంగంలోనూ ఉమ్మడి విశాఖ కీలకంగా మారుతోంది. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఫార్మా కంపెనీల కొత్త యూనిట్ల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు జరిగాయి. రూ.500 కోట్లతో ఫార్మాసిటీలో 20 ఎకరాల్లో ఏర్పాటైన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యుజియా స్టెర్లీ యూనిట్ ప్రారంభించడం ద్వారా 750 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. అచ్యుతాపురంలో లారస్ సంస్థ రూ. 440 కోట్లతో నిర్మించిన ఫార్ములేషన్ బ్లాక్‌ను, రూ. 191 కోట్లతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 300 మందికి ఉపాధి కల్పిస్తున్న యూనిట్–2ను సీఎం ప్రారంభించారు. అదేవిధంగా రూ. 240 కోట్లతో 450 మందికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో పరవాడ వద్ద నిర్మించనున్న యూనిట్–3తో పాటు మరో రూ. 240 కోట్లతో నిర్మించనున్న యూనిట్–7కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ యూనిట్ ద్వారా 450 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం రూ.1,611 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఈ పరిశ్రమల ద్వారా 2,450 మందికి ఉపాధి లభించనుంది.

అభివృద్ధి, సంక్షేమాలను తెలిపేలా..

సామాజిక బస్సు యాత్ర

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించడానికి తలపెట్టిన సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఎండాడ లా కాలేజీ సమీపంలో గల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో తొలి విడత 'సామాజిక బస్సు యాత్ర' ప్రారంభం కానుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ.. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, మేనిఫెస్టోలో హామీలను విస్మరించి ప్రజలను మోసగించిన విధానాన్ని తెలియచెప్పాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, అల్లూరి జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్ గణేష్, గొల్ల బాబూరావు, కన్నబాబురాజు, చెట్టి పాల్గుణ, అప్పలనాయుడు, ఎమ్మెల్సీ రఘురాజు తదితరులు పాల్గొన్నారు.



పార్టీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి

'ఉచిత సివిల్స్ కోచింగ్' పరీక్షకు 1631 మంది హాజరు

22న రెండోదశ పరీక్ష

సాక్షి,పాడేరు: గిరిజన నిరుద్యోగ యువతీయువకులకు సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సోమవారం నిర్వహించిన మొదటి దశ అర్హత పరీక్షకు 1631 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షను రెండు దశల్లో నిర్వహిస్తారు. వీటిలో అర్హత సాధించిన పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాలకు చెందిన విద్యార్థులకు ప్రాజెక్టు లక్ష్య పేరుతో 'యువర్ విజన్–అవర్ మిషన్' కింద తొమ్మిది నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో జరిగిన ఈ పరీక్షను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద మార్కులకు నిర్వహించిన సివిల్స్ ఉచిత శిక్షణ ఎంపిక పరీక్షకు 1,753 మంది దరఖాస్తు చేసుకున్నారని, అందులో 1,631 మంది హాజరయ్యారని తెలిపారు. ఈ పరీక్షను పాడేరు, అరకు, చింతపల్లి మండలాల్లోని ఏడు కేంద్రాల్లో నిర్వహించినట్టు చెప్పారు. మొదటి దశలో 500 మందిని ఎంపిక చేసి, వారికి ఈనెల 22న రెండవ దశ పరీక్ష నిర్వహిస్తామని, అందులో ఎంపికైన వారికి 30, 31 తేదీల్లో మౌఖిక పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో వేపగుంట వైటీసీలో తొమ్మిదినెలల పాటు ఉచిత శిక్షణ అందించి సివిల్స్ ప్రిలిమ్స్‌లో విజేతలుగా నిలపడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. గిరి పుత్రులు దేశంలో అత్యున్నతస్థాయిలో ఉద్యోగం సాధించాలన్న ఆశయంతో చేస్తున్న కృషి ఫలవంతమయ్యేలా అందరూ సహకరించాలని కోరారు.



పాడేరులో పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



అరకులోయలో పరిశీలిస్తున్న పీవో అభిషేక్

క్లుప్తంగా

భూ రీ సర్వేతో మేలు

హుకుంపేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న భూరక్ష, భూ రీసర్వేతో గిరిజన రైతులకు ఎంతో మేలు జరుగుతోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తురకలమెట్ట, వల్లంగిపుట్టు, బీరిసింగి గ్రామాలకు చెందిన 146 మంది గిరిజనులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు పథకాలు అందించడమే కాకుండా భూసర్వే నిర్వహించి భూ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తోందని చెప్పారు. గ్రామాల్లో విడతల వారీగా భూ సర్వే కార్యక్రమం జరుగుతోందని, కొద్ది రోజుల్లోనే అన్ని గ్రామాల్లో సర్వేలు పూర్తి చేసి, పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేస్తూ ప్రభుత్వం ఆదుకుంటోందని తెలిపారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సామ్యూల్, డీటీ రంగారావు, ఆర్ఐ సీతమ్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సూర్యనారాయణ, మండల అధ్యక్షుడు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో గిరిజన విద్యార్థి ప్రతిభ


మహేష్‌తో కోచ్ జగన్మోహన్

చింతపల్లిరూరల్: మండలంలో తాజంగి పంచాయతీ టి.కోరుకొండ గ్రామానికి చెందిన ఓ గిరిజన విద్యార్థి రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బ్లాక్‌బెల్ట్ సాధించాడు. విశాఖపట్నం ఎంవీపీ కాలనీలో ఈనెల 13 నుంచి 16 తేదీల వరకు గ్రాండ్ మాస్టర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థి పాల్గొని బ్లాక్‌బెల్ట్ సాధించాడు. చింతపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన కొర్ర మహేష్ ఆరేళ్లుగా స్థానిక కోచ్ సూర్యవరపు జగన్మోహన్ వద్ద కరాటే శిక్షణ పొందుతున్నాడు. ఇప్పటికే గ్రీన్, ఆరెంజ్, ఎల్లో, బ్రౌన్ బెల్టులు సాధించాడు . ఈ సందర్భంగా కోచ్ జగన్మోహన్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థి మహేష్ పట్టుదలతో కరాటేలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థినులకు కూడా కరాటే శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

సీఎంకు సాదర స్వాగతం

విశాఖ, అనకాపల్లి జిల్లాల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సోమవారం పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలుకుతున్న అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు





బాల్య వివాహాలతో అనర్థాలు


గంగవరంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లక్ష్మి


కొయ్యూరులో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు

చింతూరు: జిల్లా వ్యాప్తంగా వెలుగు శాఖ, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థలను వివరించారు. చింతూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు నిర్మూలనకు కృషి చేస్తామని మహిళా సమాఖ్య సభ్యులతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

కొయ్యూరు: మండల కేంద్రంలో వెలుగు చింతపల్లి ఏరియా కో–ఆర్డినేటర్ మధుబాబు ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనారోగ్యాన్ని వివరించారు. సర్పంచ్ పీటా సింహాచలం, ఏపీఎం గాంధీ ప్రసాద్, సంక్షేమ సహాయకులు రాజుబాబు, సీసీలు రమణమ్మ, అప్పలనర్స, వీఆర్వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: దామనాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్న మాట్లాడుతూ బ్యాల వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని ఎంపీపీ బోయిన కుమారి,జడ్పీటీసీ శివరత్నం కోరారు. దామనాపల్లి సచివాలయం పరిధిలో సోమవారం జగన న్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు.దీనిలో పాల్గొన్న వారు మాట్లాడుతూ బాల్య వివాహాలతో తక్కువ వయస్సులో ఆడపిల్లలు గర్భిణులు కావడం వల్ల మాతాశిశు మరణాలు జరుగుతున్నాయన్నారు. ఆడ పిల్లలను మగపిల్లలతో సమానంగా చూడాలన్నారు. ఉన్నత విద్యను అందించాలని కోరారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల అనర్థాలపై తయారుచేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీటీసీ భీమరాజు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోఆర్‌డీ పాపారావు, కార్యదర్శి బాలకృష్ణ, ఉప సర్పంచ్ చిలకమ్మ పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదినారాయణరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యానేరమన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిమాణాలను వివరించారు. బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ లక్ష్యం అంటూ మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు. సీసీలు, వీఓఏలు, పెద్ద ఎత్తున పొదుపు సంఘాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

గంగవరం: మండలంలోని గంగవరం, కొత్తాడ అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో లక్ష్మీ సోమవారం సందర్శించారు. గ్రామస్తులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రక్తహీనత సమస్య లేకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్లు సత్యవతి , జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం: మండలంలోని చింతరేగుబల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మహిళా పోలీసు దీప మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎవరూ నిబంధనలు అతిక్రమించినా శిక్ష తప్పదన్నారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. బాల్య వివాహాల రహిత గ్రామంగా తీర్చిదిద్దుతామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ సునీత ,వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


చింతూరులో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ అమల, మండల మహిళా సమాఖ్య సభ్యులు


జీకే వీధిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ, ఎంపీడీవో

అంగన్‌వాడీ సేవలు బలోపేతం

- చిన్నారులకు ఆటపాటలతో గుణాత్మక విద్య
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌తో పౌష్టికాహారం పంపిణీ
- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివశ్రీనివాస్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వాటి సేవలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. పాడేరు నియోజకవర్గం పరిధిలో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించిన 12 అంగన్‌వాడీ కేంద్రాల భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఐటీడీఏ ప్రాంగణంలో కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీల ద్వారా సంపూర్ణమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేయడంతో పాటు గుణాత్మకమైన ప్రాథమిక విద్యను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను ప్రభుత్వం అమలు చేసి గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందని చెప్పారు. అల్లూరిసీతారామరాజు జిల్లా ఏర్పడిన నాటి నుంచి సమగ్ర గిరిజనాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఏఎస్పీ ధీరజ్, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఎస్.రత్నకుమారి, ఎంపీటీసీలు లకే రామకృష్ణపాత్రుడు, చల్లా చిట్టమ్మ, కూంతురు నరసింహమూర్తి, గిడ్డి విజయలక్ష్మి, మత్స్యరాస విజయకుమారి, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, వంతాల సీతమ్మ, వనుగు బసవన్నదొర, మాజీ ఎంపీపీలు సీదరి మంగ్లన్నదొర, ఎస్.వి.వి.రమణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపుల సత్యనారాయణ, మినుముల కన్నాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గుర్తుపట్టలేని విధంగా మృతదేహం

గూడెంకొత్తవీధి: మండలంలోని ఎర్రవరం గ్రామ సమీపంలో రామగెడ్డ కొండపై అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గూడెంకొత్తవీధి పంచాయతీ ఎర్రవరానికి చెందిన సంకట సత్యనారాయణ(50) మృతదేహాన్ని కొండపై స్థానికులు సోమవారం కనుగొన్నారు. కొన్ని రోజుల క్రితం నుంచి సత్యనారాయణ కనిపించడం లేదు. కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించారు. అయినా ప్రయోజనం లేకపోయింది. కొందరు గ్రామస్తులకు కొండపై సత్యనారాయణ మృతదేహం సోమవారం కనిపించడంతో వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో అతను ఐదు రోజుల కిందట మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఇతను కనిపించకపోవడానికి ముందు గ్రామంలో వివాదం జరిగినట్టుగా బంధువులు చెబుతున్నారు. అయితే తేనె సేకరణకు వెళ్లి రాయిపై నుంచి జారి పడిపోవడం వల్ల తీవ్ర గాయాలతో మరణించి ఉండవచ్చని మరికొందరు చెబుతున్నారు. ఇది తేనె సేకరణ సీజన్ కాకపోవడంతో ఆ ప్రాంతానికి ఎందుకు వెళ్లాడన్నది మిస్టరీగా మారింది. అందిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎస్ఐ అప్పలసూరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయిపై నుంచి జారిపడి, చనిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్టు చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పెట్రోల్ బంకుల్లో నాణ్యమైన సేవలు

కలెక్టర్ సుమిత్ కుమార్


బంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: ఐటీడీఏ పెట్రోల్ బంకుల ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. రూ.1.80 కోట్ల వ్యయంతో ఐటీడీఏ, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా స్థానిక చింతలవీధి రోడ్డులో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకును పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, ఏఎస్పీ ధీరజ్‌లతో కలిసి కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో ఇప్పటికి నాలుగు పెట్రోల్ బంకులున్నాయని చెప్పారు. గిరిజన యువతీయువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా ఐటీడీఏ పెట్రోల్ బంకులను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్లలో ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఐటీడీఏ స్వయంగా ఈ బంక్‌ను నిర్వహిస్తుండడంతో ప్రజలకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందుతాయన్నారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు కారుకు తొలిగా పెట్రోల్‌ను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి నింపి, సర్వీసులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, ఎంపీపీ సొనారి రత్నకుమారి, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, సర్పంచ్ వంతాల సీతమ్మ, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వనుగు బసవన్నదొర, సచివాలయ కన్వీనర్ నాగేష్ బాబు, ఎంపీటీసీలు చల్లా చిట్టమ్మ, రామకృష్ణ పాత్రుడు, నరసింహమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు లకే రామసత్యవతి, గబ్బాడ రాజారావు, మాజీ ఎంపీపీ ఎస్.వి.వి.రమణమూర్తి, జిల్లా పార్టీ సభ్యుడు సిరగం దశమూర్తి, మండల ఉపాధ్యక్షుడు పసుపుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ మినుముల కన్నాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్పంచులు, ఎంపీటీసీలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ సమస్యల పరిష్కారమే లక్ష్యమన్నారు. రూ.35కోట్ల వ్యయంతో 258 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలోని తాగునీటి పథకాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జయరాం మాట్లాడుతూ రూ.14.36 కోట్లతో 126 గ్రామాల్లో తాగునీటి పథకాలు మంజూరైనట్టు చెప్పారు. పనులు వేగవంతం చేస్తామన్నారు. జెడ్పీటీసీ గంగరాజు, ఎంపీడీవో శ్రీహర్షిత్, హౌసింగ్ ఏఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం


ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు మేలు జరుగుతోందని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని రాపలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గిరిజనులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 404 మంది వైద్య పరీక్షలు చేసినట్టు డాక్టర్లు శివమణి, ప్రశాంత్ చెప్పారు. జిల్లా కల్చరల్ విభాగం అధ్యక్షుడు దిలీప్‌కుమార్, వాణిజ్య విభాగ అధ్యక్షుడు ఓ.శామ్యేల్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పి.సింహాచలం, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు ధర్మయ్యదొర, సర్పంచ్ కొప్పిల దేవుడమ్మ, ఎంపిటీసీ సభ్యురాలు కోరాబు నాగలక్ష్మి, నాయకులు వెంకట్, మహేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

ఇద్దరిపై కేసు


తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో కాలంచెల్లిన ఓ కంపెనీ పానీయాలను విక్రయిస్తున్న ఇద్దరిపై జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు కేసు నమోదు చేశారు. ఇటీవల మండల కేంద్రానికి చెందిన సర్ని లక్ష్మి అనే మహిళ కాలం చెల్లించిన టాటా గ్లూకోజ్ పానీయం తాగి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరావు సోమవారం ముంచంగిపుట్టు వచ్చి, అస్వస్థతకు గురైన మహిళ.. గ్లూకోజ్ పానీయం కొనుగోలు చేసిన అంధవరపు మోహన్‌రావు కిరాణా షాపును తనిఖీ చేశారు. ఆ మహిళకు వైద్య సేవలందించిన డాక్టర్ వివేక్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన టాటా గ్లూకోజ్ డ్రింక్ ప్యాకెట్లను మోహన్‌రావు షాపులో గుర్తించినట్టు చెప్పారు. ఈ ప్యాకెట్లు సరఫరా చేసే డీలర్ గోదాంను కూడా తనిఖీ చేసి, అక్కడ కూడా గడువు ముగిసిన ఐదు బాక్సుల టాటా గ్లూకోజ్ డ్రింక్ ప్యాకెట్లను గుర్తించామని, వాటిని సీజ్ చేశామని చెప్పారు. సీజ్ చేసిన గ్లూకోజ్ డ్రింక్ ప్యాకెట్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించామని తెలిపారు. గ్లూకోజ్‌ను విక్రయించిన మోహన్‌రావు,డీలర్ రామదాసులపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

దాకోడులో రెండు ఇళ్లు దగ్ధం


అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు బియ్యం, వంట సామగ్రి, నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు


దగ్ధమైన ఇల్లు

రూ.4 లక్షల ఆస్తినష్టం

అడ్డతీగల: మండలంలోని మారుమూల ప్రాంతమైన దాకోడులో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. కానెం శివకుమార్, కానెం లక్ష్మణరావు కుటుంబాలు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలాయి. ఈ ప్రమాదంలో రూ.4 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు అంచనా. బాధితులను అడ్డతీగల ఎంపీపీ బొడ్డపాటి రాఘవ, జెడ్పీటీసీ మద్దాల వీర్రాజు, అడ్డతీగల పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తోట రాజేశ్వరరావు, నక్కా మోహన్ తదితరులు పరామర్శించారు. ఒక్కొక్కరికీ 50 కిలోల బియ్యం, రూ.3 వేల చొప్పున నగదు, వంట సామగ్రి, నిత్యావసరాలు, దుస్తులు అందజేశారు. దాకోడు సర్పంచ్ ఒండ్లోపు చిన్నదేవుడమ్మ, డి.రామవరం ఎంపీటీసీ పల్లాల విశ్వకుమారి తదితరులు పాల్గొన్నారు. ఒక్కో కుటుంబానికి రెవెన్యూ శాఖ తరఫున 10 కిలోల బియ్యం,ఒక్కో కిలో చొప్పున కందిపప్పు,పంచదార అందజేసినట్టు వీఆర్వో దాస్ చెప్పారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా


ప్రమాదానికి గురైన లారీ

మారేడుమిల్లి: మారేడుమిల్లి – చింతూరు ఘాట్ రోడ్డులో సోమవారం ఉదయం లోడు లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కి తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లారీ కాకినాడ నుంచి చేపల మేత లోడుతో మారేడుమిల్లి మీదగా ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తుండగా మండలంలోని వాలమురు గ్రామం దాటిన తర్వాత వాలీసుగ్రీవు మలుపులో ఘాట్‌రోడ్డు ఎక్కుతుండగా అదుపుతప్పి వెనుకకు జారుకుంటూ పైరోడ్డు నుంచి కింద రోడ్డు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నిర్మల్‌కర్ సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన డ్రైవర్‌ను 108 వాహనంలో మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించి, అనంతరం మెరుగైన వైద్య సేవలు కోసం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ప్రమాదం కారణంగా ఇరువైపులా మూడు గంటలసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు ఆర్‌అండ్‌బీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని లారీని పొక్లెయిన్ సాయంతో పక్కకు తీసి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.